క్లుప్తంగా

మైసమ్మ చెంత భక్తుల రద్దీ



నవాబుపేట: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పర్వతాపూర్ మైసమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం మైసమ్మ తల్లిని దర్శించుకొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మైసమ్మ దేవత నామస్మరణతో అడవి ప్రాంతం మార్మోగింది. బోనాల మొక్కులు, వాహన పూజలతో దేవాలయం ఆవరణ కిటకిటలాడింది.

సంతలో అన్నదానం



నవాబుపేట: సంతకు వచ్చిన వారికి ఉచిత భోజనం అందించే కార్యక్రమం తొమ్మిది నెలలుగా నిరాటంకంగా కొనసాగుతోంది. ప్రతి ఆదివారం సంతకు వచ్చి భోజనం చేస్తున్న ప్రజలు అన్నదాతను ఆశీర్వదిస్తున్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల కేంద్రం చుట్టు ఉన్న గ్రామాలకు చెందిన ప్రజలు సంతలో పనులు ముగించుకొని మధ్యాహ్నం ఉచిత భోజనం చేస్తున్నారు.

జడ్చర్లలో ఈద్ మిలాప్



జడ్చర్ల టౌన్: పట్టణంలోని చంద్రగార్డెన్‌లో జమాతే–ఇస్లామి–హింద్ జడ్చర్ల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఈద్ మిలాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆసంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఖాలెద్ ముబషీర్ జఫార్ హాజరయ్యారు. ఆయన ఉర్దూలో ప్రసంగించగా హాజీజుల్ రహ్మాన్ అనువదించారు. వేడుకలకు స్థానిక చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, రాష్ట్ర సంగీత నాటక అకాడమి మాజీ చైర్మన్ బి.శివకుమార్, నాయకులు కోడ్గల్ యాదయ్య, నిత్యానందంపాల్గొన్నారు.

గంటల వ్యవధిలోనే మహిళ ఆచూకీ

మహబూబ్‌నగర్ క్రైం: మానసిక ఆరోగ్య సమస్యతో ఇబ్బంది పడుతున్న ఓ మహిళ ఇంటి నుంచి తప్పిపోవడంతో గంటల వ్యవధిలోనే పోలీసులు ఆచూకీ తెలుసుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ తెలిపిన వివరాలు.. జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్‌కు చెందిన బాల నర్సింహులు 40ఏళ్ల కూతురు రాధిక మానసిక ఆరోగ్యంగా బాగా లేక ఇంట్లోనే ఉంటుంది. ఆదివారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో వెంటనే క్రైం టీం సిబ్బందిని అలర్ట్ చేసి వారు ఉంటున్న ఏరియాలో సీసీ కెమెరాల సహాయంతో గాలించి కేవలం గంటల వ్యవధిలో రాధికను గుర్తించి తండ్రికి అప్పగించినట్లు తెలిపారు.

'బీఆర్‌ఎస్‌ది దుష్ప్రచారం'

అడ్డాకుల: ప్రజాపాలనలో సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తుంటే ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య పేర్కొన్నారు. మూసాపేట మండల కేంద్రంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ నాయకులు చెరువులను చెరబట్టిన విషయాన్ని మర్చిపోయారని విమర్శించారు. చెరువుల్లో ఒండ్రుమట్టి తీసి వాటిని విధ్వంసం చేశారని అన్నారు.



దేవరకద్ర మండలం చిన్నరాజమూర్‌లో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



గండేడ్ మండలం వెన్నాచేడ్ బండమీది రామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ వేడుకలకు హాజరైన భక్తులు



మహమ్మదాబాద్ మండలం గాదిర్యాల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



మిడ్జిల్ మండల కేంద్రంలో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి హాజరైన ప్రజలు

కమనీయం.. రాములోరి కల్యాణం

- ఊరూరా వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పోటెత్తిన భక్తులు
- పలుచోట్ల అన్నదానాలు



మహబూబ్‌నగర్ మండలం చౌదర్‌పల్లిలో..



జడ్చర్ల పట్టణంలోని రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో కల్యాణోత్సవం జరిపిస్తున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్: శ్రీరామనవమిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా రాములోరి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముత్యాల పందిళ్లు వేసి పచ్చటి తోరణాలతో ఆలయాలకు కల్యాణశోభ సంతరించుకొంది. కల్యాణ ఘట్టాలతో ఆలయాలు, పరిసర ప్రాంతాలు పులకించిపోయాయి. అయా ఆలయాల అర్చకులు, వేదపండితులు సీతారాముల వివాహ ఘట్టాలను కళ్లకు కట్టినట్లు వర్ణిస్తూ పెళ్లి తంతును జరిపించగా భక్తులు ఆధ్యాత్మిక చింతనలో మునిగితేలారు. తలంబ్రాలను ఊరేగింపుగా ఆలయాలకు తీసుకువచ్చి సమర్పించారు. కొందరు భక్తులు స్వామి, అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయాల వద్ద భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పలు చోట్ల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. సాయంత్రం దేవతా మూర్తుల విగ్రహాలను గ్రామాల్లో కోలాటలు, నృత్యాలు చేస్తూ ఊరేగించారు. గ్రామపెద్దలు ఆయా పార్టీల నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గండేడ్ మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవంలో డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ చిన్నచింతకుంట మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో, అడ్డాకుల, మూసాపేట మండలాల్లో జరిగిన రాములోరి కల్యాణానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

■ మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండ, దొడ్డలోనిపల్లి, టీడీగుట్ట, న్యూగంజ్, హన్వాడ మండలం పుల్పోనిపల్లిలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు.



నవాబుపేట మండలం కుచూర్‌లో పెరుమాళ్ల ఆంజనేయస్వామి గుట్టపై ఉత్సవాల్లో భాగంగా స్వామివారి ఊరేగింపు



రాజాపూర్ మండలం రాయపల్లిలో సీతారామ విగ్రహాలతో కల్యాణానికి వస్తున్న దంపతులు



జడ్చర్ల మండలం గంగాపురంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సుఖ సంతోషాలతో ఉండాలి: ఎమ్మెల్యే యెన్నం



మహబూబ్‌నగర్‌లో కల్యాణ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని మన్యంకొండ దేవస్థానంలో జరిగిన స్వామివారి కల్యాణోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేకపూజలు చేశారు. ఎమ్మెల్యేను వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాలయంలో నిర్వహించిన అఖండ భజనలో పాల్గొన్నారు.

■ మహబూబ్‌నగర్ పట్టణంలోని అప్పన్నపల్లి, ఏనుగొండ, శ్రీనివాసకాలనీ, పంచముఖి ఆంజనేయస్వామి ఆలయం, టీచర్స్‌కాలనీ రామాలయం, అంబేద్కర్‌నగర్ రామాలయం, సద్దలగుండు, వీరన్నపేట, టీడీగుట్ట ప్రాంతాల్లో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.



హన్వాడ మండలం పుల్పోనిపల్లిలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు



దేవరకద్రలోని వాసవీమాత దేవాలయంలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం



నవాబుపేట మండలం కేశవరావుపల్లిలోని హనుమాన్ ఆలయంలో సీతారాముల కల్యాణ వేడుకలకు హాజరైన భక్తులు

తుర్క కాశలను ఆదుకోవాలని వినతి



స్టేషన్ మహబూబ్‌నగర్: అన్ని రంగాల్లో వెనుకబడిన తుర్క కాశ (బీసీ–ఈ)లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలంటూ తుర్క కాశ కార్మిక సంక్షేమ సంఘం జిల్లా ప్రతినిధులు ఆదివారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. బీసీ–ఈ 14 నంబర్‌లో తుర్కకాశ, పత్థార్‌పోడ్‌లుగా పిలవబడే ముస్లిం కులస్తులు బండలు కొట్టుకుంటూ అరకొర జీవనాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. తుర్కకాశలకు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ, ఉద్యోగ రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. అనంతరం కొత్వాల్‌ను ఘనంగా సన్మానించారు. తుర్క కాశ కార్మిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జుబేర్, ఉపాధ్యక్షుడు షేక్ ఖాజా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబుబకర్, సలహాదారులు చోటో హుస్సేన్‌మియా, జిల్లా ఇన్‌చార్జీ పాష, మహెబూబ్ పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పగిడ్యాల్, బల్సూర్‌గొండ, కొండాపూర్, పంచాంగల్‌తండా గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ, జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ సన్నబియ్యం పథకాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రతిపక్షాల కుట్రను తిప్పికొట్టి జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ నరసింహరావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, డీసీసీ ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, అనంతలక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సునీత, ఆశన్న, దస్తయ్య, గుముడాల చెన్నప్ప, ప్రభాకర్, రాజునాయక్ పాల్గొన్నారు.



కొండాపూర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హజ్‌యాత్ర అవకాశం అదృష్టం

- మౌలానా ముఫ్తి సయ్యద్ ఖాసీం అలీ

స్టేషన్ మహబూబ్‌నగర్: హజ్‌యాత్ర చేయడానికి అవకాశం రావడం అదృష్టమని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ధార్మికవేత్త మౌలానా ముఫ్తి హాఫిజ్ సయ్యద్ ఖాసీం అలీ జాహెద్ అన్నారు. జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని శాలీమార్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సొసైటీ జిల్లా అధ్యక్షుడు మహమూద్‌అలీ అధ్యక్షతన హజ్‌యాత్రికులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. శిబిరంలో ప్రధాన వక్తగా పాల్గొన్న ఖాసీం అలీ హజ్‌యాత్రపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఇలాంటి శిక్షణ శిబిరాలను హజ్‌యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యాత్రకు సంబంధించిన ఏమైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. హజ్‌యాత్ర ఎప్పుడు ప్రారంభమైంది, ఎలా చేయాలి, జమ్ జమ్ నీళ్ల తాగే విధానం, ఎహరాం (దీక్షా దుస్తులు) ధరించే విధానం అంశాలను వివరించారు. కార్యక్రమంలో మౌలానా హాఫీజ్ గులాం మహమ్మద్, జిల్లా హజ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మహెమూద్‌అలీ, మేరాజుద్దీన్, రవూఫ్‌పాష, సత్తార్, మహ్మద్ రఫీక్, సయ్యద్ నిజాముద్దీన్, కలీమొద్దీన్, అహ్మద్ పటేల్, రజాఖ్, ఎండి.ఇలియాస్, మూసా, సిరాజుద్దీన్, రఫీక్ ఉర్ రహెమాన్, ఎండి.అర్షద్‌అలీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మౌలానా ముఫ్తి సయ్యద్ ఖాసీం అలీ

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆదిత్య పరాశ్రీ స్వామిజీ, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: సనాతన ధర్మాన్ని కాపాడుకుందామని అంబాత్రయ క్షేత్రం పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామి అన్నారు. మూసాపేట మండలం తుంకినీపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించి పూజలు చేశారు. అక్కడే రూ.5లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యేప్రారంభించారు. విగ్రహదాత మాజీ సర్పంచ్ చిన్న బుచ్చన్నగౌడ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వామిజీ మాట్లాడారు. సనాతన ధర్మాన్ని చేజార్చుకోకుండా ఇప్పటి నుంచే అందరు ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ కొండా ప్రశాంత్‌రెడ్డి, దేవరకద్ర బాలన్న, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, వీహెచ్‌పీ నాయకుడు రాచాల జనార్ధన్, గ్రామ యువకులు తదితరులు ఉన్నారు.

బీజేపీ ఎదుగుదల ఓర్వలేకనే ఆరోపణలు

పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యజ్ఞభూపాల్‌రెడ్డి



దేవరకద్రలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

దేవరకద్ర: రాష్ట్రంలో బీజేపీ ఎదుగుతుంటే ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ వారు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యజ్ఞభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకద్రలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు. దేశ సమగ్రతను కాపాడుతూ ప్రపంచంలోనే అత్యున్నత స్థానానికి దేశాన్ని చేర్చిన ఘనత బీజేపీకి, ప్రధాని మోదీకి దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణంరాజు, నాయకులు దేవన్నసాగర్, రాచాలరాజు, నాగిరెడ్డి, అశోక్‌సాగర్, విద్యాసాగర్, కృష్ణయ్య, భీమన్న, అంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

భూత్పూర్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని భూత్పూర్ పట్టణంలోని చౌరస్తాలో పార్టీ జెండాను ఎగరవేశారు. బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు నర్సింహులు, మండల అధ్యక్షుడు ఉంధ్యాల రాంరెడ్డి, రాష్ట్ర నాయకులు సత్తయ్య గౌడ్, జిల్లా హరినాథ్ గౌడ్, గాల్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు. చిన్నచింతకుంట మండల కేంద్రంలో జరిగిన వేడకల్లో పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నంబిరాజు హాజరై జెండాను ఎగరవేశారు. పార్టీ మండల అధ్యక్షుడు దశరథ్, కుర్వ రమేష్, నాయకులు సుదర్శన్‌గౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎర్ర వెంకటన్న, చంద్రుడు, గుబ్బ శ్రీను, జనార్ధన్ రెడ్డి, బాల్‌చందర్, మనోహర్ పాల్గొన్నారు.

బీజేపీ జెండాల..

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని గ్రామాల్లో బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలను ఆపార్టీ నాయకులు నిర్వహించారు. అడ్డాకుల, కందూర్, జానంపేట, వేముల తదితర గ్రామాల్లో బీజేపీ జెండాలను ఎగుర వేశారు.

ఇసుక మాఫియాపై చర్యలు చేపట్టాలి

జడ్చర్ల: మూసాపేట తహసీల్దార్ రాజు, సిబ్బందిపై అనుచిత వ్యాఖ్యలు చేసి భయాందోళనలకు గురిచేసిన ఇసుక మాఫియాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జడ్చర్ల నియోజకవర్గ టీఎన్‌జీఓ అధ్యక్షుడు తిరుపతయ్య ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రోజురోజుకూ ఇసుక మాఫియా ఆగడాలు శృతిమించుతున్నాయని పేర్కొన్నారు. అధికారులకు రక్షణ కల్పించే విధంగా కలెక్టర్, ఎస్పీ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దుమ్ము లేస్తోంది

- కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు
- నీళ్లు కొట్టించని కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

జడ్చర్ల టౌన్: స్థానిక సిగ్నల్‌గడ్డపై 167వ నంబరు జాతీయరహదారిపై కొనసాగుతున్న పనులతో దుమ్ము లేస్తోంది. ఆదివారం శ్రీరామనవమి కావటంతో ప్రభుత్వ సెలవు ఉండటం అందరికి తెలిసిందే. అయితే రోడ్డుపై దుమ్ములేవకుండా నీళ్ల కొట్టేందుకు సైతం కాంట్రాక్టర్ సెలవు ఇచ్చారేమో అంటూ స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. భారీ వాహనాలు వచ్చి వెళ్లిన సమయంలో సిగ్నల్ గడ్డపై ఆరాధ్యమార్ట్ నుంచి అమోఘ ఆస్పత్రి వరకు దుమ్ము లేస్తూనే ఉంది. ద్విచక్ర వాహనదారులు, పాదచారుల ముక్కుల్లోకి వెళ్లి ఇబ్బందులకు గురిచేస్తోంది. రాత్రిళ్లు సైతం దుమ్ము అధికంగా వస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. పనిదినాల్లో మొక్కుబడిగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళలో ట్యాంకర్‌తో నీళ్ల పట్టిస్తున్న కాంట్రాక్టర్ ఆ తరువాత విస్మరిస్తుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా నిరంతరంగా నీళ్లు వేస్తూ దుమ్ము లేవకుండా చూడాలని జాతీయ రహదారి, మున్సిపల్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.



భారీ వాహనం వెళ్లిన సమయంలో లేస్తున్న దుమ్ము

ధ్యాన సాధనతో ఆత్మవిశ్వాసం



హన్వాడ: ధ్యాన సాధనతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ కొండారెడ్డి అన్నారు. మండలంలోని దాచక్‌పల్లిలో ఆదివారం ధ్యాన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ నిత్యం ధ్యానం చేసే వారికి రోగాలు దరిచేరవన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంజయ్ ముదిరాజ్ మాట్లాడుతూ నేటి సమాజంలో ఒత్తిళ్లను తట్టుకోవాలంటే ధ్యానం తప్పనిసరిగా అలవర్చుకోవాలన్నారు. అన్నపూర్ణేశ్వరి వంటశాల నిర్మాణానికి రూ. 50వేలు ప్రకటించారు. ధ్యానులకు అన్నదానం చేశారు. పీఎస్‌ఎస్‌ఎం జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, రాజు, వీరేశం, శ్రీను, శ్రీపాల్‌రెడ్డి, హన్మంతు, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

'యువ వికాసం'కు 1,254 దరఖాస్తులు

జడ్చర్ల టౌన్: 'యువ వికాసం'కు మండలంలో 1.254 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారంతా కింద పేర్కొన్న ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని ఆయన పేర్కొన్నారు. ఆధార్, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువపత్రంలో ఏదైనా ఒకటి, కుల ధ్రువీకరణపత్రం, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణరంగ పథకాలకోసం), పట్టాదార్ పాస్‌బుక్ (వ్యవసాయ పథకాలకోసం) సదరం సర్టిఫికెట్ (దివ్యాంగులకోసం), పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు అన్ని మూడు ప్రతులను తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ నెల 14 వరకు దరఖాస్తులు చేసుకోవటానికి అవకాశం ఉందని ఆయన సూచించారు.

హమాలీ సంఘం కార్యవర్గం ఏర్పాటు

భూత్పూర్: హమాలీ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కురుమూర్తి తెలిపారు. హమాలీ సంఘం మండల గౌరవాధ్యక్షుడిగా వి.కురుమూర్తి, అధ్యక్షుడిగా ఎం.ఖాదరయ్య, ఉపాధ్యక్షుడిగా ఎల్.నాగేందర్, ప్రధాన కార్యదర్శిగా ఎల్.యాదయ్య, సహాయకార్యదర్శిగా ఎల్.నర్సింహులు, కోశాధికారిగా బి.వెంకటయ్య, గౌరవ సలహాదారుడిగా ఎన్.కురుమూర్తి, సలహాదారులుగా ఎల్.పెద్ద నర్సింహులు, ఎల్.మణ్యంను ఎనుకున్నట్లు పేర్కొన్నారు.